ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY








సామాజిక తనిఖీ ప్రజావేదికలో మాట్లాడుతున్న శ్రీలత

## పారదర్శకంగా ఉపాధి కల్పన

- ఇంకుడు గుంతలపై ప్రత్యేక శ్రద్ధ వహించండి
- హరితహారానికి ప్రాధాన్యం ఇవ్వాలి
- జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ పీడీ శ్రీలత
- మంచాలలో సామాజిక ప్రజావేదిక తనిఖీ

మంచాల, జూన్ 22 : మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణాభివృద్ధి పనుల్లో కూలీల ఉపాధికల్పన పారదర్శకంగా ఉండాలని జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీలత యంత్రాంగానికి సూచించారు. ఉపాధిహామీ పథకం 15వ విడత సామాజిక తనిఖీకి సంబంధించి శనివారం మంచాల మండల కేంద్రంలో ప్రజావేధిక నిర్వహించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో మండలంలో నిర్వహించిన రూ.6.07 కోట్ల పనులకు సామాజిక తనిఖీ బృందం గత 15 రోజులుగా వివిద గ్రామాల్లో నిర్వహించిన క్షేత్రస్థాయి తనిఖీ నివేదికను ఈ ప్రజావేధికలో చదివి వినిపించారు. ఈ సందర్భంగా పీడీ శ్రీలత మాట్లాడుతూ కూలీల ఉపాధికల్పనలో రికార్డుల నిర్వహణ క్రమపద్ధతిలో ఉండాలన్నారు. వర్షాలు కురుస్తున్నందున హరితహారం మొక్కల పెంపకానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఇంకా ఇంకుడు గుంతల ఏర్పాటుకు ప్రత్యేక శ్రద్ధవహించి వాననీటిని సంరక్షించాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ పీడీ సుభాషిణి, క్వాలిటీ కంట్రోల్ అధికారిణి పద్మావతి, అంబుడ్స్‌మెన్ సునీత, అసిస్టెంట్ విజిలెన్స్ అధికారి కొండయ్య, ఎంపీడీవో బాలశంకర్, ఏపీడీ సుక్రియానాయక్, సాయినాథ్, ఏపీవో వీరాంజనేయులు, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిసిబ్బంది, సామాజిక తనిఖీ బృందం ప్రతినిధులు పాల్గొన్నారు.



మహేశ్వరం పట్టణం వ్యూ

మహేశ్వరం అసెంబ్లీ నియోజకవర్గం ఇక మహానగరం కాబోతోంది. రెండు వేల ఎకరాల్లో సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్ కంపెనీలు ఏర్పాటు కానున్నాయి. ఇప్పటికే జపాన్ కంపెనీతో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందాలు కూడా కుదర్చుకున్నట్లు సమాచారం. పరిశ్రమ ఏర్పాటుకు రెండు వేల ఎకరాలు అవసరం కాగా తొలి విడతలో వేయి ఎకరాలు ఇచ్చేందుకు సర్కార్ నిర్ణయించింది. నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా అడుగులు వేస్తోంది. మహేశ్వరాన్ని వ్యాపార కేంద్రంగా మార్చాలని సర్కార్ యోచిస్తోంది. మరో ఐదేళ్లలో సెల్‌ఫోన్లు ఇక్కడ తయారు కానున్నాయి. ఇక్కడ నుంచి సెల్‌ఫోన్లను ప్రపంచ దేశాలకు ఎగుమతి చేయనున్నారు. మహేశ్వరం పారిశ్రామిక అభివృద్ధితో పాటు టూరిజం, ఎడ్యుకేషన్, ఎంటర్‌టెయిన్‌మెంట్, హెల్త్, ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్సీ హబ్‌గా అభివృద్ధి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

# మహేశ్వరం.. ఇక మహానగరం!

## రెండు వేల ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు కానున్న సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్ కంపెనీ

- మొదటి విడతలో జపాన్ కపెంనీకి వేయి ఎకరాలు ఇవ్వనున్న సర్కార్
- నిరుద్యోగులకు లక్ష ఉద్యోగాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం
- టూరిజం, ఎడ్యుకేషన్, ఎంటర్‌టెయిన్‌మెంట్, హెల్త్, ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్సీ హబ్‌గా..
- శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి ఫార్మా సిటీ వరకు ఏర్పాటు కానున్న మెట్రోలైన్
- మహేశ్వరాన్ని బిజినెస్ కేంద్రంగా చేయాలనేది సర్కార్ ఆలోచన
- ప్రపంచ దేశాలకు ఎగుమతి చేసే స్థాయిలో తయారీ కానున్న సెల్‌ఫోన్లు
- భూములు కోల్పోయే రైతులకు ప్రత్యేక ప్యాకేజీ
- మహేశ్వరం నియోజకవర్గంలో 14వేల ఎకరాల ప్రభుత్వ భూమి
- క్లియర్‌గా 12వేల ఎకరాలు, సమస్యల్లో 2 వేల ఎకరాలు
- విదేశీ కంపెనీల రాకకు సమస్యలు లేని ప్రాంతంగా మార్చేందుకు కృషి

ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి అర్బన్, జూన్ 22: హైదరాబాద్ నగర శివారు ప్రాంతాలను అభివృద్ధి చేయాలన్న యోచనలో ఉన్న ప్రభుత్వం ఈ ప్రాంతాలను మూడు క్లష్టర్లుగా విభజించేందుకు కసరత్తు ప్రారంభించింది. ఔటర్ రింగ్ రోడు లోపల భాగాన్ని అర్బన్ క్లస్టర్‌గా, ఓఆర్‌ఆర్ నుంచి ఆర్‌ఆర్‌ఆర్ వరకు ప్రాంతాన్ని సెమీ అర్బన్ క్లస్టర్‌గా, రీజనల్ రింగ్ రోడ్డు అవతల ప్రాంతాన్ని రూరల్ క్లస్టర్లుగా ఏర్పాటు చేయనుంది. ఏ క్లస్టర్లలో ఏది ఏర్పాటు చేస్తే ఆ ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయన్న దానిపై ప్రభుత్వం సమాలోచనలు చేస్తోంది. ఇప్పటికే కోకాపేట్ ప్రాంతం అభివృద్ధిలో దూసుకు పోయింది. అలాగే మహేశ్వరం కూడా అభివృద్ధిలో పరుగులు పెట్టనుంది. మహేశ్వరం అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో మొత్తం 14వేల ఎకరాల్లో ప్రభుత్వ భూమి ఉండగా అందులో 12 వేల ఎకరాలు ఎలాంటి సమస్యలు లేకుండా క్లియర్‌గా ఉన్నాయి. మరో రెండు వేల ఎకరాల్లో కొన్ని సమస్యలు ఉన్నాయి. కొత్తగా పరిశ్రమలను ఏర్పాటు చేసేందుకు ఓఆర్‌ఆర్‌కు బయట, ఆర్‌ఆర్‌ఆర్‌కు లోపల భూములను గుర్తి



స్తున్నారు. ఇక్కడ ప్రాంతానికి విదేశీ కంపెనీల రావాలంటే ఎలాంటి సమస్య ఉండొద్దనే ఉద్దేశంతో భూ సమస్యలు తీర్చాలని నిర్ణయించింది. మహేశ్వరంలో ఇప్పటికే ఎలక్ట్రానిక్ సిటీ, ఇండస్ట్రియల్ పార్కులు వచ్చాయి. రావిర్యాలలో ఫాక్స్‌ఖాన్ కంపెనీ పనులు కొనసాగుతున్నాయి. ఫార్మా కంపెనీల కోసం ఇప్పటికే రైతుల నుంచి గత ప్రభుత్వం సుమారు 10 వేల ఎకరాల భూములను సేకరించింది. అయితే, అందులో కొంతమంది రైతులకు తీవ్ర అన్యాయం జరిగిందన్న ఆరోపణలు ఉన్నాయి. ప్రస్తుత ప్రభుత్వం అలాంటి తప్పులు పునరావృతం కాకూకుండా చూసుకునేందుకు చర్యలు తీసుకుంటుంది. అర్హులైన రైతులకు అన్యాయం జరగొద్దనే ఆలోచనలో ముందుకు సాగుతోంది. భూమి కోల్పోయే రైతులకు ప్రత్యేక ప్యాకేజీ ఇచ్చేందుకు ప్లాన్ చేస్తోంది. రెండు రోజుల్లో రెవెన్యూ, పోలీస్, ఇరిగేషన్ అధికారులతో ప్రత్యేక టీం ఏర్పాటు కానున్నట్టు సమాచారం. అధికారులు రైతుల వద్దకు వెళ్లి సమస్యలను పరిష్కరించేందుకు సిద్ధమవుతున్నారు. భూ బాధితులకు న్యాయం చేసే పనిలో ఉన్నారు. భూమికి భూమి కావాలనుకునే రైతులకు మరోచోట భూమి ఇచ్చేందుకు ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తున్నట్టు సమాచారం. మరో మూడు, నాలుగు రోజుల్లో వేయి ఎరాల భూమి జపాన్ కంపెనీకి ఇచ్చేందుకు సర్వం సిద్ధం చేస్తున్నట్టు చర్చ సాగుతోంది. నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పించేందుకు అవసరమైన స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ కూడా ఇవ్వనున్నారు. ఎయిర్‌పోర్టు నుంచి ఫార్మా కంపెనీ వరకు మెట్రో లైన్ కూడా వేస్తామని గతంలోనే ప్రభుత్వం ప్రకటించింది.




విద్యార్థులకు పుస్తకాలు, స్టేషనరీ వస్తువులు పంపిణీ చేస్తున్న టర్కీ రాయబారి హి ఓరన్ యాల్మన్ ఓకన్, ఫౌండేషన్ ప్రతినిధులు

## విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలి

- టర్కీ దేశ రాయబారి హి ఓరన్ యాల్మన్ ఓకన్

శంకర్‌పల్లి, జూన్ 22: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో చదివి జీవితంలో ఎదగాలని టర్కీ దేశ రాయబారి హి ఓరన్ యాల్మన్ ఓకన్ అన్నారు. రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలం జన్వాడలోని పద్మా రవీందర్‌గౌడ్ ఫంక్షన్ హాల్‌లో శనివారం వాల్మీకి ఫౌండేషన్ 16వ వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 25 ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు బ్యాగులు నోట్‌పుస్తకాలు, స్టేషనరీ వస్తువులు, లైబ్రరీ మెటీరియల్, బాలికలకు సైకిళ్లు, శానిటరీ నాప్కిన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ఫౌండేషన్ ఆహ్వానం మేరకు ముఖ్య అతిథులుగా ఓరన్ యాల్మన్, పద్మశ్రీ మంజుల అనగాని, అంకాలజిస్ట్ డాక్టర్ రోహిణి రేగంటి, వివేక్‌వర్మ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఓకన్ మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదివి జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించి సమాజానికి మంచి పనులు చేయాలన్నారు. సేవాభావాన్ని అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో వాల్మీకి ఫౌండేషన్ అధ్యక్షుడు సూర్య గణేష్, ప్రధాన కార్యదర్శి హరిక్రిష్ణ, ఫౌండేషన్ సంయుక్త కార్యదర్శి పుష్ప, ఎంఈవో అక్బర్, హెచ్‌ఎంలు నరహరి, జయసింహారెడ్డి, నర్సింగ్‌రావు, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పింఛన్ కోసం పంచాయతీ వద్ద పడిగాపులు



ఫించన్ కోసం వృద్ధులు, వికలాంగులు, వితంతువులు హిమాయత్‌నగర్ పంచాయతీ కార్యాలయం వద్ద శనివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు పడిగాపులు కాశారు. ఇలా ఎందుకని కార్యదర్శిని అడిగినా పట్టించుకోవడం లేదని పింఛన్‌దారులు తెలిపారు. సకాలంలో పింఛన్ ఇచ్చేలా అధికారులు చర్యలు తీసుకోలవాలని వృద్ధులు కోరారు.

\- మొయినాబాద్ రూరల్, జూన్ 22



చేవెళ్ల మండలం ఆలూరులో ఎడ్లబండ్లతో ర్యాలీ నిర్వహిస్తున్న రైతులు

## ఘనంగా ఏరువాక

తొలకరి జల్లులు కురియగానే ఆనందోత్సాహాల మధ్య రైతులు నాగలి దున్ని సాగు పనులు మొదలు పెట్టే ఏరువాక పౌర్ణమి వేడుకలను శనివారం వైభవంగా నిర్వహించారు. చేవెళ్ల మండలంలోని వివిధ గ్రామాల్లో ఎడ్లకు రంగులు వేసి అలంకరించి ఊరేగించారు. ఆలయాల చుట్టూ ప్రదక్షణలు చేశారు. ఎడ్లకు పొలేలు, బెల్లాన్ని దాణాగా పెట్టారు. అనంతరం రైతులు పొలాల్లో నాగళ్లు, గుంటకలతో దమ్ము చేశారు. చేవెళ్ల మండలంలోని కౌకుంట్ల, ఆలూరు గ్రామాల్లో రైతులు ఎడ్లబండ్లతో ర్యాలీ నిర్వహించారు. చౌదరిగూడ మండలం పరిధిలోని వివిధ గ్రామాల్లో కూడా రైతులను ఎద్దులను అందంగా అలంకరించి బండ్లు కట్టి ర్యాలీ నిర్వహించారు.

\- చేవెళ్ల, జూన్ 22



శిథిలావస్థకు చేరిన బస్టాండ్ పాఠశాల భవనం

# చరిత్ర ఘనం.. సౌకర్యాలు హీనం!

## దయనీయంగా ఆమనగల్లు బస్టాండ్ ఉన్నత పాఠశాల

- అసౌకర్యాల బడిలో విద్యార్థుల అవస్థలు
- శిథిలావస్థకు చేరిన పాత పాఠశాల భవనం
- రేకుల షెడ్లలో తాత్కాలికంగా తరగతుల నిర్వహణ
- ప్రతిపాదనల్లోనే సొంత భవన నిర్మాణం

ఆమనగల్లు, జూన్ 22: ఆమనగల్లు పట్టణంలోని జిల్లా పరిషత్ (బస్టాండ్) ఉన్నత పాఠశాల దయనీయంగా తయారైంది. ఏళ్ల కాలంగా అసౌకర్యాల నడుమ కొనసాగుతోంది. కనీస మౌలిక సదుపాయాలు లేని పాఠశాలలో విద్యార్థుల చదువులకు తీవ్ర ఆటంకం కలుగుతోంది. దశాబ్దాల చరిత్ర కలిగి ఎందరో మేధావులనందించిన ఈ పాఠశాలలో ఏటేటా విద్యార్థుల సంఖ్య తగ్గుతూ మూతపడే స్థితికి చేరుకుంది. పాఠశాలకు సొంత భవన నిర్మాణం గురించి రెండు దశాబ్ధాలుగా స్థానికులు, విద్యార్థుల తల్లిదండ్రులు ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తున్నా, ప్రజాప్రతినిధులు, అధికారులకు విన్నవిస్తున్నా స్పందన కనిపించడం లేదు. భవన నిర్మాణం నేతల హామీలకే పరిమితమైంది. ప్రతిపాదనల్లోనే నిలిచింది. ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన వసతులు కల్పించి కార్పొరేట్, ప్రైవేట్‌కు దీటుగా తీర్చి దిద్దుతున్నట్లు ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు పేర్కొంటున్నా ఇక్కడ పరిస్థితులు మాత్రం అందుకు విరుద్ధంగా ఉన్నాయి.



నిర్వహణ కొరవడిన మరుగుదొడ్లు, మూత్రశాలలు

### 79 మంది విద్యార్థులతో...

ఆమనగల్లు పట్టణంలోని బస్టాండ్ ఉన్నత పాఠశాలలో 6 నుంచి 10 తరగతులు కొనసాగుతున్నాయి. ఐదు తరగతుల్లో ప్రస్తుతం 79 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. విద్యార్థుల సంఖ్య పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేస్తున్నా వసతుల లేమితో తమ పిల్లలను ఈ బడిలో చేర్పించేందుకు తల్లిదండ్రులు ఆసక్తి చూపడం లేదు. ఫలితంగా 2020 నుంచి క్రమంగా విద్యార్థుల సంఖ్య తగ్గుతూ వస్తోంది. పాఠశాలలో జీవశాస్త్ర, గణిత, సాంఘీక శాస్త్ర ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. క్లర్క్, అటెండర్, స్వీపర్ పోస్టులు భర్తీ చేయకపోవడంతో పారిశుధ్య నిర్వహణ కూడా ఇబ్బందిగా మారింది. పాఠశాల ఆవరణలో అపరిశుభ్రత చోటు చేసుకుంది. విధి లేక ఉపాధ్యాయులే తరగతి గదులను శుభ్రం చేసుకుంటున్నారు.

### రేకుల షెడ్లలో తరగతుల నిర్వహణ

ఆమనగల్లు పట్టణానికి ఐదు దశబ్ధాల క్రితం యూపీఎస్ మంజూరైంది. పాఠశాలను అప్పట్లో ఓ అద్దె భవనంలో ప్రారంభించారు. ఆ తర్వాత మూడు దశబ్ధాల క్రితం బస్టాండ్ సమీపంలో ఉన్న పాత ప్రభుత్వ ఆసుపత్రి భవనంలోకి పాఠశాలను మార్చారు. 12 ఏళ్ల క్రితం యూపీఎస్ పాఠశాలను ఉన్నత పాఠశాలగా ప్రభుత్వం అప్‌గ్రేడ్ చేసింది. 10ఏళ్ల క్రితం సొంత భవన నిర్మాణానికి ప్రభుత్వం ద్వారా రూ.25 లక్షలు మంజూరైనా నిర్ధిష్టమైన స్థలం లేక నిధులు వెనక్కి మళ్లాయి. ప్రస్తుతం పాఠశాల కొనసాగుతున్న భవనం, స్థలం మండల పరిషత్ ఆధీనంలో ఉన్నాయి. దాన్ని పాఠశాలకు పూర్తిస్థాయిలో కేటాయించాలని స్థానికులు ప్రజాప్రతినిధులు, అధికారులను కోరుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. పాఠశాల నిర్వహించే పాత ఆసుపత్రి భవనం శిథిలమై ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి ఏర్పడింది. దీంతో దాతల సహకారంతో టీచర్లు ఆరు రేకుల షెడ్లు నిర్మించారు. వాటిలో ఐదు షెడ్లలో తరగతులు, ఒక షెడ్ ఉపాధ్యాయులు వినియోగిస్తు న్నారు. పాఠశాలలో మరుగుదొడ్లు, మూత్రశాలలు నీటి వసతి లేక నిరూపయోగంగా మారాయి. తలుపులు ధ్వంసమయ్యాయి. దీంతో విద్యార్థులు ఇళ్ల వద్దకు వెళ్లాల్సి వస్తుంది.



పాఠశాల ఆవరణలో పెరిగిన చెట్లు



రేకుల షెడ్లలో కొనసాగుతున్న తరగతులు

### అధికారులకు నివేదించాం



ఆమనగల్లు బస్టాండ్ ఉన్నత పాఠశాలకు సొంత భవన నిర్మాణం గురించి అధికారులు, ప్రజా ప్రతినిధులకు విన్నవించాం. ప్రస్తుత భవనం శిథిలావస్థకు చేరుకుంది. భవనం గురించి మున్సిపాలిటీ అధికారులకు నివేదించాం. సరైన గదులు, వసతులు లేక ఇబ్బందులు కలుగుతున్న మాట వాస్తవమే.

కె. పద్మ ప్రధానోపాధ్యాయురాలు

### ఇబ్బంది పడుతున్నాం



పాఠశాలకు సొంత భవనం నిర్మించాలి. శిథిలావస్థకు చేరిన భవనంతో ఇబ్బందిగా ఉంది. భవనం లేని కారణంగా తాత్కాలికంగా ఏర్పాటు చేసిన షెడ్లలో తరగతి గదులు కొనసాగుతున్నాయి. ప్రస్తుతం పాఠశాల కొనసాగుతున్న భవనం, స్థలం స్థానంలోనే విశాలంగా నూతన భవనం నిర్మిస్తే బాగుంటుంది.

\- శుశాంత్, విద్యార్థి

### ఎవరూ పట్టించుకోవడం లేదు



పాఠశాల సొంత భవన నిర్మాణం గురించి ఎవరూ పట్టించుకోవడం లేదు. ప్రతిఏటా భవన నిర్మాణం జరుగుతుంది.. ఇబ్బందులు తీరుతాయని ఆశపడడం తీరా నిరాశకు లోనవుతున్నాం. పాఠశాలలో మౌలిక వసతులు కూడా లేవు. దీంతో చదువులకు ఆటంకం కలుగుతుంది. ఉన్నత స్థాయి ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ తీసుకొని వెంటనే భవన నిర్మాణం చేపట్టాలి.

\- శ్రీజ, 10వ తరగతి విద్యార్థిని

# శిఖర స్కూల్‌లో ఏడాది పాటు
# తొమ్మిదో తరగతి రద్దు

హైదరాబాద్, జూన్ 22 (ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా దుండిగల్-గండి మైసమ్మ మండలంలోని బౌరంపేటలో గల శిఖర స్కూల్(ఇంటి నెంబర్ 6-7/5/4)'లో తొమ్మిదో తరగతిని ఏడాది పాటు సస్పెండ్(రద్దు) చేస్తున్నట్లు సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్(సీబీఎస్ఈ) రీజినల్ ఆఫీసర్ శేఖర్ చంద్ర ఓ ప్రకటనలో తెలిపారు. సీబీఎస్ఈ అఫిలియేషన్ కోసం దరఖాస్తు(అప్లికేషన్ నెంబర్ 90828-2324) చేసిన సందర్భంలో ఆ స్కూలు యాజమాన్యం... తమ పాఠశాలలో ఎనిమిదో తరగతి వరకే విద్యార్థులు చదువుతున్నట్లు సమాచారమిచ్చిందని వివరించారు. కానీ, ఆ ఎనిమిదో తరగతి పిల్లలను తొమ్మిది, పదో తరగతులకు ప్రమోట్ చేసిన వివరాలను తమకు వెల్లడించలేదని తెలిపారు. నిజానికి 1.4.2023 నుంచి తొమ్మిదో తరగతిని ప్రారంభించడానికి 2023 జూన్ 25న ప్రత్యేక షరతులతో సీబీఎస్ఈ అఫిలియేషన్‌ను మంజూరు చేశామని పేర్కొన్నారు. తొమ్మిదిలో ఉత్తీర్ణులైనవారిని 1.4.2024 నుంచి పదో తరగతికి ప్రమోట్ చేసేలా అనుమతి ఇచ్చామన్నారు. కానీ, ఆ స్కూలు యాజమాన్యం నిబంధనలను పాటించకుండా తొమ్మిది, పదో తరగతులకు విద్యార్థులను ప్రమోట్ చేశారని తెలిపారు. ఈ దృష్ట్యా 1.4.2024 నుంచి ప్రారంభమయ్యే అకాడమిక్ సెషన్‌లో తొమ్మిదో తరగతిలో విద్యార్థులను చేర్చుకోవద్దంటూ ఆదేశించామని వివరించారు. అంటే.. ఏడాది పాటు(31.3.2025 వరకు) తొమ్మిదో తరగతిని రద్దు చేస్తున్నామన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు కూడా ఈ విషయాన్ని గమనించాలని సూచించారు. కాగా, 2023లో తొమ్మిదో తరగతిలో రిజిస్టర్ చేసుకున్న విద్యార్థులను 2025 ఫిబ్రవరిలో జరిగే సీబీఎస్ఈ పరీక్షలకు అనుమతిస్తున్నామని పేర్కొన్నారు.

# డాక్టర్ లేకపోతే..
# వైద్యమందేదెలా?

● విధుల పట్ల అలసత్వం.. రోగుల ఇక్కట్లు
● ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాలకు చుట్టపు చూపుగా వచ్చిపోతున్న వైద్యురాలు
● చికిత్స కోసం వచ్చి వెనుదిరుగుతున్న రోగులు


వైద్యం కొరకు వచ్చిన రోగులు.. ఖాళీగా ఉన్న డాక్టర్ కుర్చీ

చౌదరిగూడ, జూన్ 22 : అది పేరుకే ప్రభుత్వ ఆయుర్వేద ఆసుపత్రి.. డాక్టర్ మాత్రం చుట్టపుచూపుగా వచ్చి వెళుతుంటారు. ఈ విషయమై గతంలో మండల సర్వసభ్య సమావేశంలో సభ్యులందరూ ముక్తకంఠంతో మండలంలో అసలు ఆయుర్వేద ఆస్పత్రి ఉందా?.. ఉంటే డాక్టర్ ఎక్కడా? అని ప్రశ్నల వర్షం కురిపించిన సందర్భాలూ ఉన్నాయి. ఆసుపత్రికి చికిత్స నిమిత్తం వచ్చిన రోగులు డాక్టర్ లేకపోవడంతో వెనుతిరిగి పోవడం మామూలైంది. ఈమేరకు శనివారం 'ఆంధ్రజ్యోతి' విజిట్‌లో పలు విషయాలు వెలుగులోకి వచ్చాయి. వివరాల్లోకి వెళితే.. ఆయుష్ పథకం కింద గతంలో మండల కేంద్రంలో ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల ఏర్పాటు చేశారు. అయితే, అందులో విధులు నిర్వహించే వైద్యురాలు అందుబాటులో ఉండటం లేదు. ఎప్పుడు చూసినా కుర్చీ ఖాళీగా దర్శనమిస్తోందని పలువురు రోగులు తెలిపారు. ఎప్పుడు ఆసుత్రికి వచ్చినా ఫార్మసిస్టే మందులు ఇస్తాడని, వైద్యురాలు శీలారాణి కనిపించదని వాపోయారు. ఓ వ్యక్తి మాట్లాడుతూ తాను ఏడాది కాలంలో మూడుసార్లు మాత్రమే డాక్టర్ ఉండటాన్ని చూశానని తెలిపాడు. ఆస్పత్రికి ఏ రోగి వచ్చినా నాలుగైదు రకాల మందులను ఫార్మసిస్టు అందించడమే నిత్యకృత్యంగా మారిందని రోగులు వాపోతున్నారు. కాగా, మండల కేంద్రంలో గురువారం సంత కోసం వచ్చిన కొందరు మాత్రమే మందులు తీసుకువెళ్తుంటారని సమాచారం. అయితే, ఆ రోజు కూడా డాక్టర్ ఇక్కడ వాష్‌రూం లేదంటూ మధ్యాహ్నమే వెళ్లిపోతుందంటూ పలువురు తెలిపారు. సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న తరుణంలో డాక్టర్ అందుబాటులో లేకపోవడంతో రోగులకు ఇబ్బందిగా మారనుంది. కాగా, విధులకు హాజరయ్యే డాక్టర్.. అటెండెన్స్ రిజిష్టర్‌లో వారం, పది రోజులుగా సంతకం చేయడం ఎలా మరిచిపోయిందో తెలియడం లేదు. ఆస్పత్రిలో లేకపోవడంపై డాక్టర్‌కు ఫోన్ చేస్తే.. కరెంట్ మీటర్‌కు డీడీ కట్టేందుకు వెళ్లినట్లు సమాధానమిచ్చింది. అయితే వారం క్రితమే డీడీ తీసుకోగా.. మీటర్ సైతం మంజూరు చేశామని, సిబ్బంది వేరే పనుల్లో బిజీగా ఉన్నందున ఫిట్టింగ్ చేయడం ఆలస్యమైందని ఏఈ రవికుమార్ తెలిపారు. ఒకటి, రెండు రోజుల్లో మీటర్ ఫిట్టింగ్ చేస్తామని ఏఈ తెలిపారు. అంతకుముందు ఆస్పత్రి సిబ్బంది(ఫార్మసిస్టు) డాక్టర్ ఎస్టీవోకు వెళ్లినట్లు తెలిపారు. ఇప్పటికైనా రోగులకు అందుబాటులో ఉండి చికిత్స అందించాలని మండల ప్రజలు కోరుతున్నారు.



అజీజ్‌నగర్‌లో మాట్లాడుతున్న ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి

# చేవెళ్ల అభివృద్ధికి కృషి : ఎంపీ

మొయినాబాద్ రూరల్, జూన్ 22: తనపై నమ్మకంతో కష్టపడి పనిచేసి అత్యధిక మెజారిటీతో రెండోసారి ఎంపీగా గెలిపించిన బీజేపీ శ్రేణులతో పాటు ప్రజలకు రుణపడి ఉంటానని, చేవెళ్ల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధులు రాబట్టేందుకు కృషి చేస్తానని ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని అజీజ్‌నగర్‌లో బీజేపీ జెండావిష్కరణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన ప్రతీ హామీని అమలు చేసేందుకు కృషి చేస్తానని, తన గెలుపుకోసం కష్టపడి పనిచేసిన ప్రతీ కార్యకర్తకు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. హైదరాబాద్-బీజాపూర్ రోడ్డు పనులు ప్రారంభమయ్యేలా కృషి చేస్తానన్నారు. రాష్ట్రంలో రాబోయేది బీజేపీ ప్రభుత్వమేనని, నాయకులు, కార్యకర్తలు సమాయత్తం కావాలని పిలుపునిచ్చారు. సీనియర్ నాయకులు సన్‌వెళ్లి ప్రభాకర్ రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు తూర్పు శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి తూర్పు మాధవరెడ్డి, మహేందర్‌రెడ్డి, కాంత్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, కుమ్మరి మహేందర్, రాజుయాదవ్, కొండల్‌రెడ్డి ఇతర నాయకులు పాల్గొన్నారు.



# వ్యాపారంలో నష్టం.. దోపిడీకి యత్నం

- విదేశాల్లో ఉద్యోగం వదిలి స్వదేశానికి..
- కుటుంబ పోషణకు ర్యాపిడో డ్రైవర్‌గా మారి.. ఆదాయం సరిపోక చోరీలకు యత్నం
- నగల దుకాణంలో దోపిడీ కేసులో జైలుకు.. నిందితుడితో పరిచయం.. రాబరీకి స్కెచ్.. పది చోట్ల రెక్కీ.
- మేడ్చల్‌లోని నగల దుకాణంలో రాబరీకి ప్రయత్నం బాధితుల ప్రతిఘటనతో 40 సెకండ్లలోనే పరారీ
- సీసీ ఫుటేజీ సాయంతో 24 గంటల్లో కేసు ఛేదించిన పోలీసులు
- ఇద్దరి అరెస్టు.. పరారీలో మరో వ్యక్తి : సీపీ అవినాష్ మహంతి



విలేకరుల సమావేశంలో కేసు వివరాలు వెల్లడిస్తున్న సీపీ అవినాష్ మహంతి

హైదరాబాద్ సిటీ, జూన్ 22 (ఆంధ్రజ్యోతి): ఉన్నత చదువులు చదివి, అమెరికాలో ఉద్యోగం చేసిన వ్యక్తి నగరానికి వచ్చి వ్యాపారం ప్రారంభించాడు. వ్యాపారంలో నష్టం రావడంతో ర్యాపిడో డ్రైవర్‌గా పనిచేశాడు. ఆర్థిక ఇబ్బందుల నుంచి బయటపడేందుకు నగల దుకాణంలో దోపిడీకి యత్నించి పోలీసులకు పట్టుబడ్డాడు. జైలులో పరిచయమైన నేరగాడితో కలిసి దోపిడీకి పథకం వేశాడు. అయితే, పోలీసులకు పట్టుబడకుండా నిందితులు వేసిన ఎత్తులను ఖాకీలు చిత్తుచేశారు. దోపిడీకి యత్నించిన 24 గంటల్లోనే ఇద్దరు నిందితులను సైబరాబాద్ పోలీసుల అరెస్ట్ చేశారు. కేసుకు సంబంధించిన వివరాలను కమిషనరేట్‌లో శనివారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో సీపీ అవినాష్ మహంతి, మేడ్చల్ డీసీపీ కోటిరెడ్డితో కలిసి కేసు వివరాలు వెల్లడించారు. జైలులో పరిచయమైన పాత నేరస్తులు కలిసి దోపిడీకి పథకం వేశారని, గుర్తుపట్టకుండా ఉండేందుకు పలు ఎత్తులు వేశారని.. కానీ, పోలీసుల దర్యాప్తులో వారిని పట్టుకున్నామన్నారు. మహారాష్ట్రకు చెందిన నజీమ్ అజీజ్ కొరాడియా(36) చదువు పూర్తి చేసుకొని ఆఫ్రికా, చైనా, అమెరికాల్లో ఉద్యోగం చేశాడు. అతడి తల్లిదండ్రులు అమెరికాలో ఉన్నారు. అమెరికా నుంచి నగరానికి వచ్చి కొంపల్లిలో ఉంటూ వ్యాపారం చేసేవాడు. అతడికి పెళ్లై కుమారుడు కూడా ఉన్నాడు. వ్యాపారంలో భారీ నష్టాలు రావడంతో కుటుంబ పోషణ కోసం ర్యాపిడో డ్రైవర్‌గా పనిచేయడం ప్రారంభించాడు. ఆదాయం పెంచుకోవడానికి రెండు బైకులు కొనుగోలు చేసి ఇద్దరు యువకులతో ర్యాపిడో డ్రైవర్లుగా పనిచేయించేవాడు. ఇలా వచ్చిన ఆదాయం సరిపోకపోవడంతో ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు నగల దుకాణంలో చోరీ చేయాలని పథకం పన్నాడు. చాదర్‌ఘాట్‌లోని ఓ నగల దుకాణంలో యజమానిపై కత్తితో దాడిచేసి, నగలు తీసుకొని పరారయ్యాడు. ఈ కేసులో హైదరాబాద్ పోలీసులు అతడిని అరెస్ట్ చేసి చంచల్‌గూడ జైలుకు తరలించారు. ఈక్రమంలో జైలులో మరో నిందితుడు షేక్ సొహైల్ పరిచయమయ్యాడు. ఇద్దరూ కలిసి దోపిడీలు ఎలా చేయాలనే విషయంపై జైలులో చర్చించుకునేవారు. నజీం, సొహైల్‌లు జైలు నుంచి విడుదలయ్యాక కలుసుకున్నారు. నగల దుకాణంలో దోపిడీ చేయాలని పథకం వేసుకున్నారు. దోపిడీకి పథకం వేసిన వీరిద్దరూ నగరంలో కుత్బుల్లాపూర్, జగద్గిరిగుట్ట, ఉప్పల్, బోడుప్పల్, కార్వాన్, బోరబండ, వెస్ట్ మారేడ్‌పల్లి, మలక్‌పేట్, అంబర్‌పేట్, మేడ్చల్‌లో ఉన్న నగల దుకాణాలను గుర్తించారు. ఆయా దుకాణాల వద్ద పరిస్థితులను గమనించేందుకు పలుమార్లు రెక్కీ నిర్వహించారు. మేడ్చల్‌లో ఉన్న దుకాణాన్ని టార్గెట్ చేశారు.

### పోలీసులకు చిక్కకుండా పథకం

ఇప్పటికే కేసులో అరెస్టై జైలుకు వెళ్లిన అనుభవం ఉన్న ఇద్దరూ పోలీసులకు పట్టుబడకుండా ఉండేందుకు అనేక జాగ్రత్తలు తీసుకున్నారు. పోలీస్ దర్యాప్తు గురించి బాగా అధ్యయనం చేసి, ముఖం గుర్తు పట్టకుండా ఉండేందుకు బురఖా, హెల్మెట్, గ్లవ్స్ కొనుగోలు చేశారు. దోపిడీ కోసం హబ్సిగూడలో పల్సర్ బైకును చోరీ చేశారు. తమ కదలికలు సీసీ కెమెరాల్లో చిక్కకుండా ఉండేందుకు బైకును రెండు రోజులముందే మేడ్చల్‌కు రెండు కిలోమీటర్ల దూరంలో నిలిపి ఉంచారు. మరో నిందితుడు సల్మాన్ సాయంతో అశోక్ లేలాండ్ వాహనంలో మేడ్చల్‌లో వాహనం పార్కింగ్ చేసిన ప్రాంతానికి చేరుకున్నారు. అక్కడి నుంచి బైకుపై టార్గెట్ చేసిన నగల దుకాణం వద్దకు చేరుకున్నారు.

### 40 సెకన్ల దోపిడీలో ట్విస్టులు

ముఖాన్ని గుర్తించకుండా ఉండేందుకు నజీం బురఖా ధరించగా, సొహైల్ హెల్మెట్ ధరించి జగదాంబ జ్యువెలర్స్ దుకాణంలో ప్రవేశించారు. దుకాణంలో కస్టమర్లు లేకపోవడంతో యజమానిపై కత్తితో దాడిచేసి దోపిడీకి యత్నించారు. దుకాణ యజమాని కుమారుడు అప్రమత్తమై కేకలు వేయడంతోపాటు ఎదురుదాడికి యత్నించడంతో అక్కడి నుంచి బైకుపై పరారయ్యారు. మేడ్చల్ నుంచి నిజామాబాద్ వైపుకు వెళ్లి రోడ్డుకు పక్కగా బైకును నిలిపి సల్మాన్ ఆటోలో పరారయ్యారు. పోలీస్ స్టేషన్‌కు సమీపంలో ఉండటం, ఫిర్యాదు రావడంతో నిమిషాల వ్యవధిలోనే పోలీసులు సంఘటనాస్థలికి చేరుకున్నారు. సీసీ కెమెరాల ఫుటేజీ ఆధారంగా దర్యాప్తు ప్రారంభించినా వారి ఆనవాళ్లు కనిపించలేదు. అయితే, ఈ కేసును సీరియస్‌గా తీసుకున్న సీపీ నిందితులను పట్టుకునేందుకు మేడ్చల్, దుండిగల్ పోలీసులు, మేడ్చల్, బాలానగర్ సీసీఎస్, మేడ్చల్, బాలానగర్ ఎస్వోటీ పోలీసులతో కలిపి మొత్తం 16 బృందాలను రంగంలోకి దించారు.

### చోరీ బైకు ఆధారంగా దర్యాప్తు

సీసీ ఫుటేజీ ఆధారంగా నిందితుల గురించి తెలుసుకోలేకపోయిన పోలీసులు దోపిడీకి వినియోగించిన బైకును స్వాధీనం చేసుకున్నారు. బైక్ వివరాలు సేకరించిన పోలీసులకు హబ్సిగూడలో చోరీ అయిందని గుర్తించారు. బైక్ చోరీ జరిగిన ప్రాంతంలో ఫుటేజీ ఆధారంగా దర్యాప్తు ప్రారంభించారు. దాదాపు 200 పైగా సీసీ ఫుటేజీలను జల్లెడ పట్టిన పోలీసులు, నిందితుల జాడను గుర్తించారు. నాంపల్లి రైల్వేస్టేషన్ సమీపంలో ఉన్న అజీజ్ కొరాడియా, షేక్ సొహైల్‌లను అరెస్ట్ చేశారు. వారి నుంచి పల్సర్ వాహనం, బురఖా, గ్లవ్స్, బ్యాగ్, రెండు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.

# జాతీయ స్థాయి 'ఇన్‌స్పైర్'కు జిల్లా నుంచి రెండు ప్రాజెక్టులు

వికారాబాద్, జూన్ 22 (ఆంధ్రజ్యోతి) : జాతీయ స్థాయి ఇన్‌స్పైర్ అవార్డుల ప్రదర్శనకు వికారాబాద్ జిల్లా నుంచి రెండు ప్రదర్శనలు ఎంపికయ్యాయి. ఈనెల 14, 15వ తేదీల్లో ఆన్‌లైన్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్ అవార్డుల ప్రదర్శనలో తెలంగాణ రాష్ట్రం నుంచి మొత్తం 26 ప్రదర్శనలను జాతీయస్థాయి ప్రదర్శనకు ఎంపిక చేయగా, జిల్లా నుంచి రెండు ప్రదర్శనలు ఎంపిక కావడం విశేషం. చౌడాపూర్ మండలం, మరికల్ జడ్పీహెచ్ఎస్ విద్యార్థి విశాల్ రూపొందించిన ఆటోమెటిక్ సేఫ్టీ ఎలక్ట్రిక్ పోల్, దోమ మండలం, దాదాపూర్ జడ్పీహెచ్ఎస్ విద్యార్థి పోలేపల్లి యశ్వంత్‌గౌడ్ తయారుచేసిన పెడల్ డ్రివెన్ సిమెంట్ మిక్సింగ్ టూల్ ప్రదర్శనలను ఎంపిక చేశారు. ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో న్యూఢిల్లీలో నిర్వహించనున్న జాతీయస్థాయి ఇన్‌స్పైర్-మనక్ ప్రదర్శనలో జిల్లా నుంచి రెండు ప్రాజెక్టులను ప్రదర్శించనున్నారు. ఈమేరకు విశాల్, యశ్వంత్‌గౌడ్, గైడ్ టీచర్లు జి.రవి కుమార్, శాంతకుమార్, ప్రధానోపాధ్యాయులు సర్వ మంగళ, అమర్‌నాథ్‌లను డీఈవో రేణుకాదేవి, జిల్లా సైన్స్ అధికారి విశ్వేశ్వర్‌లు అభినందించారు.




ఆటోమెటిక్ సేఫ్టీ ఎలక్ట్రిక్ పోల్ ప్రాజెక్టుతో విద్యార్థి విశాల్

జాతీయస్థాయి ప్రదర్శనలో జిల్లా సత్తా చాటేలా సంసిద్ధం కావాలని వారు సూచించారు.

వర్షాకాలంలో కరెంట్ స్తంభాలకు కరెంట్ ప్రసారమై జంతువులు, మనుషులు విద్యుదాఘాతానికి గురై చనిపోతూ ఉంటారు. ఇలాంటి ప్రమాదాల నుంచి ప్రజలను రక్షించేందుకు మరికల్ జడ్పీహెచ్ఎస్‌లో 10వ తరగతి చదువుతున్న విద్యార్థి విశాల్ ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయుడు జి.రవికుమార్ మార్గదర్శకత్వంలో ఆటోమెటిక్ సేఫ్టీ ఎలక్ట్రిక్ పోల్ ప్రాజెక్టును అభివృద్ధి పరిచారు. విద్యుత్ స్తంభాల వద్ద కరెంట్‌షాక్‌కు గురికాకుండా ఉండేందుకు ఎలక్ట్రికల్ పోల్ వద్ద కాపర్ తీగను ఆర్డినో, ఐఆర్ సెన్సార్, ఇన్సులేటర్లు, బ్యాటరీ తదితర పరికరాలను అమర్చి వర్షం కురిసినప్పుడు పోల్ వద్ద షాక్ నుంచి రక్షించే వ్యవస్థను రూపొందించాడు. జడ్పీహెచ్ఎస్ మరికల్ పాఠశాల నుంచి ఇన్‌స్పైర్ ప్రదర్శన జాతీయ స్థాయికి ఎంపిక కావడం వరుసగా ఇది రెండోసారి. గతేడాది నీటిని ఇంధనంగా మార్చుకొని నడిచే వాహనాన్ని రూపొందించిన విషయం తెలిసిందే.

భవన నిర్మాణ రంగంలో నైపుణ్యం కలిగిన కార్మికుల కొరత కొంత వరకు అధిగమించేందుకు పెడల్ డ్రివెన్ సిమెంట్ మిక్సింగ్ టూల్ ఉపయోగపడనుంది. తాపీ మేస్త్రీకి సిమెంట్ కలపడానికి నైపుణ్యం కలిగిన కార్మికులు అవసరం. కాగా, భవన నిర్మాణాలు ఎక్కువ సంఖ్యలో కొనసాగుతుండడంతో కార్మికుల కొరత ఏర్పడుతోంది. సిమెంట్ కలపడానికి అవసరమయ్యే కార్మికుల పని పెడల్ డ్రివెన్ సిమెంట్ మిక్సింగ్ టూల్‌తో చేయవచ్చు. బేస్‌ఫ్రేమ్, ట్రైనింగ్ ఫ్రేమ్, కంటైనర్, పెడల్, చక్రంతో పెడల్ డ్రివెన్ సిమెంట్ మిక్సింగ్ టూల్ రూపొందించారు. బేస్‌ఫ్రేమ్ మొత్తం బరువు కలిగి ఉంటుంది. లిఫ్టింగ్ ఫ్రేమ్ కంటైనర్‌తో స్థిరంగా ఉంటుంది. ఇది సిమెంట్ కలపడానికి ఉపయోగపడుతుంది. కంటైనర్ సిమెంట్, ఇసుక, నీటిని మిక్సింగ్ చేస్తుంది. కంటైనర్ చక్రాల గేర్‌తో జతపరిచారు. ఇది సైకిల్ ఛైన్‌కు, సైకిల్ పెడల్‌తో జతచేశారు. పెడల్‌ను తిప్పినప్పుడు గొలుసు కంటైనర్‌ను తిప్పుతుంది. తద్వారా కంటైనర్‌లోని సిమెంట్, కంకర, నీరు మిక్స్ అవుతుంది. తాపీ మేస్త్రీకి ఎంతగానో ఉపయోగకరంగా ఉండే ఈ టూల్ నిర్వహణకు నైపుణ్యం కలిగిన కార్మికులు అవసరం లేదు. ఎవరైనా దీంతో సిమెంట్‌ను కలపవచ్చు. భవన నిర్మాణం పనుల్లోనే కాకుండా ఇతర సిమెంట్ పనులకు కూడా దీనిని ఉపయోగించవచ్చు. దోమ మండలం, దాదాపూర్ జడ్పీహెచ్ఎస్ విద్యార్థి పోలేపల్లి యశ్వంత్‌గౌడ్ యంత్రాన్ని తయారు చేశారు.



పెడల్ డ్రివెన్ సిమెంట్ మిక్సింగ్ టూల్‌తో యశ్వంత్‌గౌడ్, గైడ్ టీచర్ శాంతకుమార్

## రాచకొండ కమిషనరేట్‌లో ఇన్‌స్పెక్టర్ల బదిలీ

హైదరాబాద్ సిటీ, జూన్ 22(ఆంధ్రజ్యోతి): రాచకొండ కమిషనరేట్‌లో పలువురు ఇన్‌స్పెక్టర్‌లను బదిలీచేస్తూ సీపీ తరుణ్‌జోషి ఆదేశాలు జారీచేశారు. సైబర్‌క్రైం విభాగంలో పనిచేస్తున్న ఎ.వెంకటయ్యను కీసర ఎస్‌హెచ్‌వోగా, కీసర ఎస్‌హెచ్‌వోగా విధులు నిర్వహిస్తున్న కె.సీతారామ్‌ను కందుకూరు ఠాణాకు, కందుకూరు ఎస్‌హెచ్‌వోగా పనిచేస్తున్న మక్బూల్‌జానీని సైబర్‌క్రైం విభాగానికి, యాదాద్రి ట్రాఫిక్ విభాగానికి చెందిన కె.నాగరాజును మీర్‌పేట పోలీస్‌స్టేషన్‌కు, హయత్‌నగర్ డీఐ కె.శ్రీనివాస్‌ను మహేశ్వరం ఎస్వోటీకి బదిలీచేస్తూ ఆదేశాలు జారీ చేశారు.

## కేసీఆర్‌ను కలిసిన ఎమ్మెల్యే యాదయ్య



చేవెళ్ల, జూన్ 22 : మాజీ సీఎం కేసీఆర్‌ను చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య మర్యాదపూర్వకంగా కలిశారు. ఈమేరకు శనివారం రాత్రి ఎర్రవల్లి ఫామ్ హౌస్‌లో కేసీఆర్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందించారు. అమెరికా పర్యటన ముగించుకొని స్వదేశానికి వచ్చిన తర్వాత కేసీఆర్‌ను కలిసినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఆయనతో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు అనంత్‌రెడ్డి తదితరులున్నారు.

## ఆలయాలకు పాలక మండళ్లు ఏర్పాటు చేయాలి

- మంత్రి సురేఖకు విన్నవించిన ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు, జూన్ 22 : తాండూరు నియోజకవర్గంలోని ప్రసిద్ధిచెందిన పలు దేవాలయాలకు వెంటనే పాలక మండళ్లు ఏర్పాటు చేయడంతో పాటు ఆలయాల అభివృద్ధికి నిధులు కేటాయించాలని తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి శనివారం దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖకు విన్నవించారు. ఈమేరకు మంత్రికి ఆయన వినతిపత్రం అందజేశారు. ఇప్పటికే ఆలయాలకు ఛైర్మన్, సభ్యులను ఏర్పాటు చేయాల్సిందిగా ప్రతిపాదనలు పంపినట్లు ఎమ్మెల్యే మంత్రికి వివరించారు. స్పందించిన సురేఖ ఆలయాల అభివృద్ధికి కావాల్సిన నిధులు కేటాయించి పాలక మండళ్లు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి పేర్కొన్నారు.



మంత్రి సురేఖకు వినతిపత్రం ఇస్తున్న మనోహర్‌రెడ్డి

## ఘనంగా సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు

చేవెళ్ల, జూన్ 22 : మండల కేంద్రంలోని శ్రీ సత్యసాయి మందిరంలో శనివారం ఉదయం సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యసాయిబాబా మందిరంలో 50మంది దంపతులు స్వామివారి వ్రతాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణం దైవనామస్మరణతో మారుమోగింది. స్వామివారి వ్రతాల తర్వాత దంపతులకు నిర్వాహకులు తీర్థప్రసాదాలు అందించారు. వ్రతాలు తిలకించేందుకు భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. సత్యసాయి సేవా సమితి కన్వీనర్ రంగారెడ్డి, సేవా సమితి సభ్యులు, గ్రామస్తులు, భక్తులు తదితరులు ఉన్నారు.



## మంచాల పీఏసీఎస్ చైర్మన్‌గా హన్మంత్‌రెడ్డి



హన్మంత్‌రెడ్డిని సత్కరిస్తున్న నాయకులు

మంచాల, జూన్ 22 : మంచాల ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘం నూతన చైర్మన్‌గా వెదిరె హన్మంత్‌రెడ్డి ఎన్నికయ్యాడు. శనివారం నిర్వహించిన పీఏసీఎస్ మధ్యంతర చైర్మన్ ఎన్నికలో భాగంగా కాంగ్రెస్‌కు చెందిన హన్మంత్‌రెడ్డి విజయం సాధించారు. సహకార సంఘంలో జరిగిన కార్యకలాపాల్లో అక్రమ లావాదేవీల విచారణలో చైర్మన్ బుస్సు పుల్లారెడ్డి ఇటీవల పదవిని కోల్పోయాడు. ఆ తర్వాత తాత్కాలిక చైర్మన్‌గా బొద్రమోని యాదయ్య నియమితులయ్యారు. కాంగ్రెస్ పార్టీ మద్దతుదారులైన డైరెక్టర్లు ఆయనపై అవిశ్వాసం పెట్టడంతో నూతన చైర్మన్ ఎన్నిక నిర్వహించారు. మొత్తం 13 మంది సభ్యుల్లో బుస్సు పుల్లారెడ్డిపై అనర్హత వేటు పడగా.. 12 మందితో ఎన్నిక నిర్వహించారు. కాంగ్రెస్ మద్దతుతో వెదిరె హన్మంత్‌రెడ్డి, బీఆర్ఎస్, బీజేపీ మద్దతుతో కొంగర జనార్దన్‌రెడ్డిలు నామినేషన్లు దాఖలు చేశారు. మొత్తంగా ఏడుగురు సభ్యుల మద్దతుతో హన్మంత్‌రెడ్డి చైర్మన్‌గా ఎన్నికయ్యారు.

## ఈము రైతులకు అండగా ప్రభుత్వం

షాద్‌నగర్ అర్బన్, జూన్ 22: నాబార్డు సంస్థ మాటలు నమ్మి నట్టేట మునిగిన ఈము పక్షుల పెంపకందారులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావులు హామీ ఇచ్చారని తెలంగాణ రాష్ట్ర ఈము పక్షుల పెంపకందారుల సంఘం అధ్యక్షుడు పి.వెంకటేశ్వర్‌రెడ్డి తెలిపారు. శనివారం విలేకరులతో మాట్లాడుతూ ఈము రైతులు 15 ఏళ్లుగా ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరించారు. వ్యవసాయానికి అనుబంధంగా ఈము పక్షులను పెంచితే లాభాలు వస్తాయని శిక్షణ ఇచ్చిన నాబార్డు సంస్థ భరోసా.. బ్యాంకులు ఇచ్చిన అప్పుతో ఈము పక్షులను పెంచామని తెలిపారు. ఈము పక్షులకు మార్కెట్ లేకపోవడంతో రైతులు నష్టపోయారని, కొందరు ఆస్తులు అమ్ముకున్నారని, మరికొందరు ఆత్మహత్యలు చేసుకున్నారని వాపోయారు. ఇదే అంశంపై నివేదిక పొందిన ఏపీలో చంద్రబాబునాయుడు ప్రభుత్వం వన్‌టైం సెటిల్మెంట్ చేసిందని, 50శాతం ప్రభుత్వం, 25శాతం రైతులు, 25శాతం బ్యాంకర్లు భరించేలా సమస్యను పరిష్కరించిందన్నారు. తెలంగాణలో సమస్యను రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి దృష్టికి తేవడంతో మంత్రులతో మాట్లాడి పరిష్కారానికి చొరవ చూపారని, వన్‌టైమ్ సెటిల్మెంట్ చేయాలని మంత్రులు బట్టి, తుమ్మలను స్టేట్‌లెవల్ బ్యాంకర్ల సమావేశంలో కోరగా.. సానుకూలంగా స్పందించారని తెలిపారు.

## ఆరేళ్లుగా తట్టెడు మట్టి పోయలే!

- పన్నుల వసూలు తప్ప.. అభివృద్ధి ఏది?
- వెక్కిరిస్తున్న 'అభివృద్ధి' శిలాఫలకాలు
- పోచారం మున్సిపాలిటీ విహారి కాలనీవాసుల ఆవేదన

ఘట్‌కేసర్, జూన్22: గత ఆరేళ్లుగా తమ కాలనీలో మున్సిపాలిటీ ఆధ్వర్యంలో తట్టెడు మట్టిపోసిన పాపాన పోలేదని పోచారం మున్సిపాలిటీ విహారి కాలనీవాసులు ఆరోపించారు. శనివారం కాలనీలోని వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కొక్కు ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన విలేకరుల సమావేశంలో పలువురు మున్సిపాలిటీ పాలకవర్గంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నాలుగున్నరేళ్ల మున్సిపాలిటీ పాలకవర్గం హయాంలో ఎలాంటి చిన్న పనిని చేపట్టకపోవడం ఏంటని ప్రశ్నించారు. ఎప్పుడో వేసిన బీటీ రోడ్లు నేడు మట్టిరోడ్లు అయ్యాయని వాపోయారు. సంవత్సరానికి రూ.20లక్షల ట్యాక్సులు చెల్లిస్తున్నామని, అయినా కూడా తమ కాలనీలో చిన్న అభివృద్ధి పని చేపట్టకుండా లక్షల రూపాయాలు పన్నుల రూపంలో పిండుకుంటున్నారని మండిపడ్డారు. మున్సిపాలిటీ ఆధ్వర్యంలో కాలనీలో రూ.5లక్షలతో డ్రైనేజీ నిర్మాణం చేస్తున్నామని.. పనులు చేపట్టి మధ్యలోనే వదిలేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదేమిటంటే లెవలింగ్ కలువలేదని చెప్పి చేతులు దులుపుకున్నారని వాపోయారు. కాంట్రాక్టర్ తప్పుచేస్తే అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. తాగడానికి చుక్క నీరు రావడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ చైర్మన్, కమిషనర్‌తోపాటు కౌన్సిలర్‌కు అనేక సార్లు వినతిపత్రాలు అందజేసినా ఫలితం లేదన్నారు. ఎమ్మెల్యే మల్లారెడ్డి మంత్రిగా ఉన్నప్పుడు మూడు పనులకు శిలాఫలాకాలు వేశాడని, అందులో ఏ ఒక్క పని చేపట్టలేదన్నారు. ఆ శిలాఫలాకాలను తొలగించాలని, లేదంటే పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రధాన కార్యదర్శి ఉపేందర్, తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేదలకు ఇంటి స్థలాలు చూపాలి

కందుకూరు, జూన్ 22 : కందుకూరు రెవెన్యూ పరిధిలో గతంలో నిరుపేదలకు ఇళ్ల స్థలాల కోసం ఇచ్చిన సర్టిఫికెట్లను ఆధారం చేసుకొని వారికి కబ్జా చూపాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు దుబ్బాక రాంచందర్ డిమాండ్ చేశారు. ఈమేరకు పార్టీ మండల కార్యదర్శి బి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో శనివారం ఆర్డీవో సూరజ్‌కుమార్‌కు వినతి పత్రం ఇచ్చారు. ఆయన మాట్లాడారు. 788, 107 సర్వేనెంబర్లలో పేదలకు గతంలో ఇళ్ల స్థలాలకు సంబంధించి సర్టిఫికెట్లను ఇచ్చారని గుర్తుచేశారు. కానీ, నేటికీ వారికి కబ్జా చూపలేదన్నారు. ఎ.కుమార్, ఆర్.శేఖర్, బి.బాల్‌రాజ్, సత్తయ్య, తదితరులున్నారు.

## విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ



విద్యార్థులతో యునైటెడ్ ఫ్రెండ్స్ ఫౌండేషన్ సభ్యులు

ఇబ్రహీంపట్నం, జూన్ 22 : తులేకలాన్ ప్రాథమికోన్నత పాఠశాలలో యునైటెడ్ ఫ్రెండ్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం విద్యార్థులకు నోట్‌బుక్‌లు పంపిణీ చేశారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రభుత్వం చర్యలు తీసుకొంటుందని, స్వచ్ఛంద సంస్థలు కూడా తమ వంతు సహకారం అందించాలని హెచ్‌ఎం విజయలక్ష్మి అన్నారు. తల్లిదండ్రులుతమ పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో ఫౌండేషన్ చైర్మన్ సత్తు సింహాద్రిరెడ్డి పాల్గొన్నారు.

## పాఠశాలకు వంట పాత్రల అందజేత


వంట సామగ్రి అందజేస్తున్న నాయకుడు సురేందర్

కొత్తూర్, జూన్ 22 : ఉన్నత పాఠశాలలో వంటసామగ్రి లేక భోజన కార్మికులు ఇబ్బంది పడుతున్నారని కాంగ్రెస్ షాద్‌నగర్ నియోజకవర్గ ఎస్సీసెల్ అధ్యక్షుడు కర్రోల్ల సురేందర్ వంట పాత్రలు కొనిచ్చారు. శనివారం హెచ్‌ఎం అంగోర్‌నాయక్‌కు అందజేశారు. ఈ సందర్భంగా సురేందర్‌కు హెచ్‌ఎం కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పీఈటీ విజయ్‌సాగర్, గోప్యానాయక్, వరుణ్, మహిపాల్, యాదగిరి, వంట సిబ్బంది పాల్గొన్నారు.

## స్వయం ఉపాధి రంగాల్లో రాణించాలి




మొయినాబాద్ రూరల్, జూన్ 22 : యువత స్వయం ఉపాధి రంగాల్లో రాణించాలని అఖిల భారత స్వదేశీ జాగరణ్ మంచ్ ప్రముఖ్ అన్నద శంకర్‌జీ అన్నారు. ఇంజనీరింగ్ విద్యార్థులు మేధాశక్తిని పెంపొందించుకోవాలని సూచించారు. చిలుకూరు పరిధి కేజీరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో స్వదేశీ జాగరణ్ మంచ్ ఆధ్వర్యంలో శనివారం 'స్వయం ఉపాధి-యువత సాధికారత' సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా అన్నదశంకర్‌జీ హాజరై మాట్లాడుతూ.. ఉత్పాదక రంగాల్లో ఎదిగిన విద్యార్థులను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మంచ్ రాష్ట్ర కోకన్వీనర్ ఈశ్వర్, ప్రిన్సిపాల్ సత్యనారాయణరెడ్డి, సెంట్రల్ లీగల్ సెల్ సభ్యుడు మోహన్‌రెడ్డి, యువమోర్చా రాష్ట్ర ట్రైని ంగ్ సెల్ కన్వీనర్ సుధీంద్ర, బీజేవైఎం మండలాధ్యక్షుడు శ్రీకాంత్, ఎల్లేశ్‌గౌడ్, శ్రీనాథ్, జైపాల్‌రెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి,శ్రీధర్, శ్రీకాంత్, నవీన్, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రతీ గ్రామానికి బస్సులు నడపండి : ఎమ్మెల్యే

షాద్‌నగర్ అర్బన్, జూన్ 22 : విద్యార్థులకు సమస్యలు రాకుండా ప్రతీ గ్రామానికి బస్సులు నడపాలని ఎమ్మెల్యే శంకర్, షాద్‌నగర్ ఆర్టీసీ డిపో మేనేజర్ ఉషను ఆదేశించారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆర్టీసీ సిబ్బందితో శనివారం ఎమ్మెల్యే సమీక్ష నిర్వహించారు. పాఠశాలలు పునఃప్రారంభమైనందున బస్సులు రావడం లేదని గ్రామాల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. డిపోలో డ్రైవర్ల కొరత ఉందని, అన్ని రూట్లలో సర్వీసులు నడపలేకపోతున్నామని డీఎం తెలిపారు. డిపోకు డ్రైవర్లను కేటాయించేలా చూడాలని ఎమ్మెల్యేకు విన్నవించారు. అత్యవసర రూట్లలో సోమవారం నుంచి, మిగిలిన రూట్లలో జూలై ఒకటి నుంచి బస్సులను నడిపిస్తామని ఆమె తెలిపారు. కార్యక్రమంలో ఆర్టీసీ సిబ్బంది సుధాకర్, నర్సింహ, స్వాములయ్య, అర్జున్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

చేవెళ్ల, జూన్ 22: ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల్లో నూతన సిలబస్‌ను ప్రవేశపెట్టిందని చేవెళ్ల సీడీపీవో శోభారాణి తెలిపారు. శనివారం చేవెళ్లలో అంగన్‌వాడీ టీచర్లకు సిలబస్‌పై శిక్షణ ఇచ్చారు. ఆమె మాట్లాడుతూ.. చిన్నారులకు అంగన్‌వాడీ టీచర్లు ఎలా బోధించాలో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. టీచర్లు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, సిబ్బంది తదితరులు ఉన్నారు.


అంగన్‌వాడీలకు శిక్షణిస్తున్న సీడీపీవో శోభారాణి

# తాగునీటి సమస్య రాకుండా చూడాలి


అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

కేశంపేట, జూన్ 22: మండలంలో పారిశుధ్యం, తాగునీటి సమస్య రాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. షాద్‌నగర్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో శనివారం మండలాధికారులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వానాకాలం దృష్ట్యా గ్రామాల్లో పారిశుధ్య చర్యలు ఎప్పటికప్పుడు చేయాలన్నారు. ప్రజలకు తాగునీటి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. మంచి నీరు అవసరమున్న ప్రాంతాల్లో పంచాయతీ బోర్లను వాడుకోవాలని తెలిపారు. మోటర్ల మరమతులు చేయించాలన్నారు. అధికారులకు ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను తీర్చాల న్నారు. సమావేశంలో తహసీల్దార్ ఆజంఅలీ, ఎంపీడీవో రవిచంద్రకుమార్‌రెడ్డి, ఏవో శిరీష, ఎంఈవో మనోహర్, పశువైద్యాధికారి నివేదిత, డీటీ గీత, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

### సామాజిక బాధ్యతనే పారిశ్రామిక ప్రగతి

షాద్‌నగర్ అర్బన్: సామాజిక బాధ్యతతో ముందుకు సాగితేనే పరిశ్రమలు ప్రగతిని సాధిస్తాయని ఎమ్మెల్యే శంకర్ అన్నారు. దివ్యశక్తి, రౌండ్‌టేబుల్ ఇండియా సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో షాద్‌నగర్‌లోని సోలిపూర్ ప్రభుత్వ పాఠశాలకు 40లక్షలతో నాలుగు గదులను నిర్మించారు. ఈ గదులను ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రతీ పరిశ్రమ సామాజిక బాధ్యతతో పాటుపడాలని కోరారు. పర్యావరణ పరిరక్షణతో పాటు సేవాభావంతో ఉండే పరిశ్రమలకు ప్రభుత్వ సహకారం ఉంటుందన్నారు. తరగతి గదులను నిర్మించిన సంస్థ ప్రతినిధులను ఎమ్మెల్యే అభినందించారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి సహకరించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కె.నరేందర్, కౌన్సిలర్ కృష్ణవేణి, మాజీ సర్పంచ్ పి.శ్రీశైలంగౌడ్, కమిషనర్ వెంకన్న, సంస్థ ప్రతినిధులు సునిత్ గాంధీ, గౌరవ్ అగర్వాల్ పాల్గొన్నారు.

## ఇచ్చిన మాటకు కట్టుబడిన కాంగ్రెస్


విలేఖరులతో మాట్లాడుతున్న గూడూరు శ్రీనివాస్‌రెడ్డి

కడ్తాల్, జూన్ 22 : రైతుల రూ.2లక్షల వరకు పంట రుణాలు మాఫీ చేయాలని మంత్రి వర్గం నిర్ణయించడం చరిత్రాత్మకమని డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, ఆమనగల్లు మాజీ జడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చినమాటకు కట్టుబడి ఉందన్నారు. ఆమనగల్లు లో శనివారం వారు విలేఖరుల సమావేశంలో మాట్లాడారు.ప్రభుత్వ నిర్ణయంతో రాష్ట్రంలోని 47లక్షల మంది రైతులు ప్రయోజనం పొందుతారన్నారు. రైతుభరోసా అమలుకు విధివిధానాలు రూపొందించాలని ప్రభుత్వం నిర్ణయించడం కాంగ్రెస్ ప్రభుత్వానికి రైతులపై ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. రుణమాఫీ, రైతుభరోసా, గార్యంటీల అమల్లో అనుమానాలకు తావులేదన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రజారంజక పాలన చూసి ఓర్వలేని విపక్షాలు తప్పుడు ప్రచారానికి ఒడిగట్టాయని శ్రీనివాస్‌రెడ్డి, నర్సింహ మండిపడ్డారు. వరంగల్ రైతు డిక్లరేషన్‌లో ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ రైతులకు ఇచ్చిన రూ.2లక్షల రుణమాఫీ మాట ప్రకారం ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. విషప్రచారాన్ని కాంగ్రెస్ శ్రేణులు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. సమావేశంలో పార్టీ ఇతర నాయకులు పాల్గొన్నారు.

## కేంద్రమంత్రిని కలిసిన మాజీ ఎంపీ రాములు


కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని సన్మానిస్తున్న మాజీ ఎంపీ రాములు

ఆమనగల్లు, జూన్ 22: కేంద్ర బొగ్గుగనుల శాఖ మంత్రి గంగాపురం కిషన్‌రెడ్డిని శనివారం నాగర్‌కర్నూల్ మాజీ ఎంపీ, బీజేపీ రాష్ట్ర నాయకులు పి.రాములు మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని మంత్రి నివాసంలో ఆయనను కలిసి పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. నాగర్‌కర్నూల్ ప్రాంత అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వ నిధులివ్వాలని కోరారు.

## ఎంపీ రవిని కలిసిన కేశవులు



ఆమనగల్లు, జూన్ 22 : నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవిని శనివారం ఆమనగల్లు మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్, కాంగ్రెస్ జిల్లా సీనియర్ నాయకుడు గుర్రం కేశవులు మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని నివాసంలో ఎంపీని కలిసి సత్కరించారు. లోక్‌సభలో ప్రమాణస్వీకారం సందర్భంగానూ రవిని కలిశానని కేశవులు తెలిపారు. ఆమనగల్లు మునిసిపాలిటీ అభివృద్ధికి ప్రభుత్వపరంగా సహకరించాలని ఎంపీని కోరానన్నారు.

## చదువుకు పేదరికం అడ్డుకాదు

తలకొండపల్లి, జూన్ 22: చదువుకు పేదరికం అడ్డుకాదని జడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ అన్నారు. ప్రతిభ ఉన్న పేద విద్యార్థులకు ప్రతీఒక్కరు చేయూతనివ్వాలన్నారు. పాతకోటతండాకు చెందిన విద్యార్థిని చిట్టి తల్లిదండ్రులు చనిపోవడంతో తాత దగ్గర ఉండి ఐదో తరగతి వరకు చదువుకుంది. తాత వయసు మీద పడడంతో బాలిక చదువుకు ఇబ్బందిగా మారింది. చేయూతనివ్వాలని వెంకటేశ్‌ను అభ్యర్థించారు. ఆయన చిట్టిని ఆమనగల్లులోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో అడ్మిషన్ చేయించారు. కార్యక్రమంలో ఉప్పల ట్రస్ట్ సభ్యులు నాగిళ్ల జగన్, బుచ్చిబాబు, తదితరులు ఉన్నారు.

## క్లాస్‌మేట్ కుటుంబానికి మిత్రుల అండ

యాచారం, జూన్ 22:తన క్లాస్‌మేట్ మరణంతో అతడి కుటుంబం పడుతున్న ఆర్థిక ఇబ్బందులను గమనించిన క్లాస్‌మేట్స్ శనివారం ఆర్థిక సాయం, బియ్యం అందించారు. గున్‌గల్ ఉన్నత పాఠశాలలో 1998-99 టెన్త్ బ్యాచ్ విద్యార్థి రాజేష్ అనారోగ్యంతో మరణించాడు. దీంతో అతడి టెన్త్ క్లాస్‌మేట్స్ జంగయ్య, టి.రాజేందర్‌రెడ్డి తదితరులు తోటి మిత్రులతో మాట్లాడి రాజేష్ కుటుంబానికి రూ.73వేలు, క్వింటాల్ బియ్యం ఇచ్చి దాతృత్వం చాటుకున్నారు.

## యువత మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలి

ఆదిభట్ల, జూన్ 22: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, లేదంటే జీవితం అంధకారం అవుతుందని ఆదిభట్ల ఎస్సై రాజు అన్నారు. ఆదిభట్ల బొంగ్లూరు పరిధి శ్రీ చైతన్య జూనియర్ కళాశాలలో శనివారం విద్యార్థులకు మాదక ద్రవ్యాల నిరోధంపై అవగాహన కల్పించారు. విద్యార్థులు ఎక్కువగా మత్తు పదార్థాలకు బానిసలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చదువుపైనే దృష్టిపెట్టాలని అన్నారు. ఎవరైనా మత్తు పదార్థాలు విక్రయిస్తే డైల్ 100కు సమాచారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ రాజు, ఎఎస్ఐ శ్రీనివాస్, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## శ్మశాన వాటిక స్థలాన్ని కాపాడండి

శంకర్‌పల్లి, జూన్ 22:శ్మశాన వాటిక స్థలాన్ని కాపాడి, ఆ స్థలం కొన్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని కొజ్జగూడ గ్రామస్థులు శనివారం తహసీల్దార్ సురేందర్‌కు వినతిపత్రం అందజేశారు. 50-60ఏళ్ల క్రితం వేణుగోపాల్ దొర శ్మశాన వాటిక కోసం స్థలాన్ని ఇచ్చాడన్నారు. ఆ స్థలాన్ని శ్మశాన వాటికకు ఉపయోగిస్తుండగా గ్రామానికి చెందిన జొన్నాడ నర్సింలు రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడని చెప్పారు. వేణుగోపాల్ దొర మనువడి వద్ద నర్సింలు భూమి కొని చుట్టూ ఫెన్సింగ్ వేసేందుకు ప్రయత్నిస్తున్నాడని తెలిపారు. శ్మశాన వాటిక స్థలాన్ని కాపాడాలని అధికారికి విజ్ఞప్తి చేశారు.

## విశ్వప్రసన్న స్వామీజీ ఆశీర్వాదం పొందిన శ్రీవర్ధన్‌రెడ్డి

షాద్‌నగర్ అర్బన్, జూన్ 22 : కర్ణాటక రాష్ట్రం ఉడిపిలోని ప్రసిద్ధ పెజావర్ మఠం పీఠాధిపతి విశ్వప్రసన్న తీర్థ స్వామీజీని శనివారం కలిసినట్లు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నెల్లి శ్రీవర్ధన్‌రెడ్డి తెలిపారు. స్వామి వారి ఆశీస్సులు పొందానని, స్వామీజి రాఘవేంద్ర స్వామి ప్రసాదం ఇచ్చారని ఆయన తెలిపారు.


విశ్వప్రసన్న తీర్థ స్వామీజీ ఆశీర్వాదం తీసుకుంటున్న శ్రీవర్ధన్‌రెడ్డి

## సేవాలాల్‌సేన రాష్ట్ర కో-కన్వీనర్‌గా గోవర్ధన్‌నాయక్

కందుకూరు, జూన్22 : సాయిరెడ్డిగూడ మాజీ సర్పంచ్ ఇస్లావత్ గోవర్ధన్‌నాయక్‌ను సేవాలాల్ సేన రాష్ట్ర కో-కన్వీనర్‌గా నియమించినట్లు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భూక్య సంజీవ్‌నాయక్ తెలిపారు. శనివారం నగరంలోని సంఘం కార్యాలయంలో గోవర్ధన్‌నాయక్‌కు నియామక పత్రాన్ని అందజేశారు. గిరిజనుల సమస్యలపై సంఘం ముందుడి పోరాటం చేస్తోందన్నారు. సేవాలాల్ సేన సంఘాన్ని మరింత అభివృద్ధి చేస్తామని, అందులో భాగంగానే గోవర్ధన్‌నాయక్‌కు రాష్ట్ర కమిటీలో చోటిచ్చినట్లు తెలిపారు.

## ఘనంగా ఏరువాక పౌర్ణమి


తుమ్మలపల్లిలో మైసమ్మ ఆలయం చుట్టూ ఎడ్లబండ్లు, ట్రాక్టర్లతో ప్రదక్షిణలు

చౌదరిగూడ, జూన్ 22 : ఏరువాకా సాగారో రన్నోచిన్నన్న.. అంటూ రైతులు ఆనందోత్సాహాల మధ్య ఏరువాక పౌర్ణమి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించుకున్నారు. పొలం పనులు ప్రారంభమయ్యే పండుగ ఏరువాక పౌర్ణమిని పురస్కరించుకొని గ్రామాల్లో కాడెడ్లను, బండ్లను, ట్రాక్టర్లను రంగులతో అలంకరించి ఊర్లో ఊరేగింపు నిర్వహించి ఆలయాల ప్రదక్షిణలు చేయించారు. వర్షాలు బాగా కురిసి పంటలు బాగా పండి రైతులంతా ఆనందంగా ఉండాలని కోరుతూ ఏరువాక పౌర్ణమి వేడుకలను జరుపుకున్నారు.

## క్రైం కార్నర్

## ప్రాణం తీసిన వివాహేతర సంబంధం

- బోనగిరిపల్లి స్టేజీ వద్ద ఘటన
- ఆలస్యంగా వెలుగులోకి


అస్తిపంజరాన్ని వెలికి తీస్తున్న పోలీసులు

షాబాద్, జూన్ 22 : వివాహేతర సంబంధాన్ని నెరపిన ఓ మహిళ సదరు వ్యక్తి చేతిలోనే హత్యకు గురైన సంఘటన షాబాద్ మండలంలో ఆలస్యంగా వెలుగుచూసింది. శనివారం ఇన్‌స్పెక్టర్ కాంతారెడ్డి తెలిపిన వివరాల మేరకు.. షాబాద్‌కు చెందిన సంతోష(30) కూలి పనులు చేసుకుంటూ జీవించేది. ఆమె భర్త గతంలోనే చనిపోయాడు. వారికి 20ఏళ్లలోపు ఇద్దరు కుమారులు ఉన్నారు. ఆమె ఫరూఖ్‌నగర్ మండలం హాజీపల్లికి చెందిన సదుల సత్తయ్యతో రెండేళ్లుగా వివాహేతర సంబంధాన్ని కొనసాగించేది. సత్తయ్య బోనగిరిపల్లి స్టేజీ వద్ద గల కొలాబరేట్ వెంచర్‌లో వాచ్‌మ్యాన్‌గా పనిచేస్తున్నాడు. ఈ వెంచర్‌లో ఇద్దరూ తరచూ కలుసుకునేవారు. కాగా సంతోష వేరొకరితో సన్నిహితంగా ఉంటూ తనను దూరం పెడుతోందని సత్తయ్య ఆమెపై పగ పెంచుకున్నాడు. 2024 ఏప్రిల్ 7న సంతోషను వెంచర్‌కు పిలిచి ఆమెతో గొడవపడి కట్టెతో చితకబాదాడు. దీంతో సంతోష తల, ఇతర శరీర భాగాలపై గాయాలై చనిపోయింది. మృతదేహాన్ని పక్కనే ఉన్న వాగులో పూడ్చిపెట్టి సత్తయ్య పరారయ్యాడు. తల్లి కన్పించకపోవడంతో ఆమె పెద్ద కుమారుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు సంతోష ఫోన్‌కాల్ లిస్టును పరిశీలించగా సత్తయ్యతో చాలా సార్లు మాట్లాడినట్లు తేలింది. దీంతో పోలీసులు అతడిపై నిఘా పెట్టారు. ఈ నెల 21న సంతోషను పాతిపెట్టిన ప్రాంతాన్ని చూసేందుకు వచ్చిన సత్తయ్యను పోలీసులు అరెస్టు చేశారు. హత్య తానే చేసినట్లు అతడు అంగీకరించాడని ఇన్‌స్పెక్టర్ తెలిపారు. ఘటనా స్థలానికి అడిషనల్ డీసీపీ విజయ్‌కుమార్, ఫోరెన్సిక్ అధికారులు, తహసీల్దార్ అన్వర్ చేరుకొని అస్తిపంజరానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. మృతురాలి కొడుకు ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## సారా తయారు చేస్తే కఠిన చర్యలు


అవగాహన కల్పిస్తున్న సీఐ బద్యనాథ్ చౌహాన్

ఆమనగల్లు, జూన్ 22 : తెలంగాణను గుడుంబారహిత రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ఎక్సైజ్ శాఖ చేపడుతున్న చర్యలకు ప్రజలు సహకరించాలని ఆమనగల్లు ఎక్సైజ్ సీఐ బద్యనాథ్ చౌహాన్ కోరారు. సారా తయారు చేసినా, అమ్మినా చర్యలు తప్పవని హెచ్చరించారు. కడ్తాల్, తలకొండపల్లి, ఆమనగల్లు మండలాల్లోని వివిధ గ్రామాల్లో శనివారం ఎక్సైజ్ అధికారులు సారా నిరోధంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. యువకులు, స్థానికులతో ర్యాలీలు నిర్వహించారు. సీఐ చౌహాన్ మాట్లాడుతూ.. గుండుంబా తయారీ, అమ్మకాలు జరిపితే చర్యలు తప్పవన్నారు. నాటుసారా వల్ల కలిగే అనర్థాలను ప్రజలకు వివరించారు. నల్ల బెల్లం, పట్టిక అమ్మినా, తరలించినా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

### ఎక్సైజ్ దాడులు.. ముగ్గురి అరెస్ట్


బెల్లం పానకాన్ని ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ సిబ్బంది

తలకొండపల్లి, కడ్తాల మండలాల్లోని చీపునుంతల, తుమ్మలకుంట తండా, చుక్కాపూర్, హర్యానాయక్, లక్ష్మీతండా, సాలార్‌పూర్ తండాల్లో ఎక్సైజ్ సీఐ బద్యనాథ్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. దాడుల్లో 4 కేసులు నమోదు చేసి ముగ్గురుని అరెస్ట్ చేసినట్లు పేర్కొన్నారు. దాడుల్లో 7లీటర్ల సారా స్వాధీనం చేసుకొని సీజ్ చేసినట్లు సీఐ బద్యనాథ్ తెలిపారు.దాడుల్లో ఎక్సైజ్ ఎస్సైలు స్వప్న, సత్యనారాయణ, సిబ్బంది శంకర్, దశరథ్, తదితరులు ఉన్నారు.

## 7క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత


పోలీసులు పట్టుకున్న రేషన్ బియ్యం

కొందుర్గు, జూన్ 22: మండల పరిధి చిన్న ఎల్కిచర్ల పంచాయతీ శివారు గ్రామం పుల్లప్పగూడలో 7క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని శనివారం పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై కృష్ణయ్య తెలిపిన వివరాల మేరకు... పుల్లప్పగూడలో పోలీసులు ఎండీ అమీర్ సొహైల్, పరమేశ్వర్ పెట్రోలింగ్‌లో భాగంగా రాజ శివకుమార్ ఇంట్లో తనిఖీ చేశారు. అక్కడ నిల్వ ఉంచిన బియ్యాన్ని పట్టుకున్నారు. 22 సంచుల్లో 7 క్వింటాళ్ల బియ్యాన్ని గుర్తించారు. రేషన్‌కార్డు దారుల నుంచి ఒక కిలోకు 10రూపాయలు పెట్టి కొన్నట్టు శివకుమార్ తెలిపాడు. ఈ బియ్యాన్ని కంపెనీల్లో పనిచేసే కార్మికులకు అమ్ముకుంటాడని ఎస్సై తెలిపారు. పెట్రోలింగ్ పోలీసుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకోని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం


మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

ఆదిభట్ల, జూన్ 22: కుళ్లిపోయిన స్థితిలో గుర్తుతెలియని మగ వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన ఆదిభట్ల పోలీస్‌స్టేషన్ పరిధి బొంగ్లూరు ఔటర్ సమీపంలో శనివారం చోటుచేసుకుంది. ఆదిభట్ల సీఐ రాఘవేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కోహెడ-బొంగ్లూరు ఔటర్ సర్వీస్ రోడ్డు పక్కన అటవీ ప్రాంతంలో కుళ్లిపోయిన స్థితిలో మృతదేహాన్ని గుర్తించారు. మృతుడు 50సంవత్సరాల వయస్సు 5.5అడుగుల ఎత్తు, బట్టతల కలిగి ఉన్నాడని, తెల్లటి చొక్కా, ఈసా కంపెనీ అండర్‌వేర్ ధరించడాని తెలిపారు. చనిపోయి చాలారోజులవడంతో అస్తిపంజరంగా మారాడన్నారు. ఈ సంఘటన రెండు నెలల క్రితం జరిగి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. మృతుడికి సంబంధించి ఎలాంటి ఆధారాల్లేవని, అతడి ఆచూకీ తెలిసిన వారు ఆదిభట్ల సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నంబర్ 8712662364కు, లేదా పోలీస్‌స్టేషన్ నంబర్ 8712662671కు సమాచారమివ్వాలని సీఐ కోరారు.

## ఫుట్‌పాత్‌పై వ్యక్తి మృతదేహం

- ఆటోలో తెచ్చి పారేసినట్లు గుర్తించిన పోలీసులు


శ్రీకాంత్ (ఫైల్)

సైదాబాద్, జూన్ 22: అనుమానాస్పద స్థితిలో ఫుట్‌పాత్‌పై ఉన్న ఓ మృతదేహన్ని నగరంలోని సైదాబాద్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సీసీ ఫుటేజీ ఆధారంగా మృతదేహాన్ని ఆటోలో తెచ్చి పడేసినట్టు గుర్తించారు. లక్ష్మీనగర్ పార్కు సమీపంలో శనివారం తెల్లవారుజామున మృతదేహం ఉందని పోలీసులకు సమాచారమొచ్చింది. మృతుడు రంగారెడ్డి జిల్లా ఫరూఖ్‌నగర్ మండలం అన్నారంలో వ్యవసాయం చేసే సంగమూల శ్రీకాంత్(40)గా పోలీసులు గుర్తించారు. శుక్రవారం రాత్రి 11:47గంటల సమయంలో డెడ్‌బాడీని ఆటోలో తెచ్చి పడవేసినట్లు గుర్తించారు. దీంతో పోలీసులు ఆటో డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని విచారించారు. కాగా శ్రీకాంత్ మృతిపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. అతడు శుక్రవారం సాయంత్రం బస్సులో నగరానికి వచ్చి సీబీఎస్ బస్‌స్టాండ్‌లో దిగాడు. అనంతరం కోఠిలోని ఓ వైన్స్‌లో మద్యం తాగాడు. రాత్రి 11:10గంటల సమయంలో అతడు సైదాబాద్ ఇంద్రప్రస్థ కాలనీలో ఉండే సోదరికి ఫోన్‌చేసి వస్తున్నానని చెప్పాడు. ఆటోలో బయల్దేరిన శ్రీకాంత్ మద్యం మత్తులో సోదరి ఇంటిని గుర్తించలేక ఆటోను తిప్పడంతో ఫుట్‌పాత్ వద్ద పడేసి వెళ్లినట్టు డ్రైవర్ చెప్పినట్లు తెలిసింది. శ్రీకాంత్‌కు మద్యం తాగి, చికెన్ తినడంతో గొంతులో చికెన్ ముక్క ఇరుక్కుపోయి మృతిచెందినట్లు పోస్టుమార్టంలో తెలినట్లు సమాచారం.



## సంక్షిప్తంగా...

- **యాచారం:** అడపాదడపా వర్షాలు కురుస్తుండడంతో పొలంగట్లపై మొక్కలు నాటాలని మండల వ్యవసాయాధికారి సందీప్‌కుమార్ సూచించారు. ప్రభుత్వం పండ్లు, పూల మొక్కలను సరఫరా చేస్తోందని చెప్పారు. ఉపాధి కూలీలతో రోడ్లపక్కన మొక్కలు నాటి కాపాడుకోవాలని కోరారు. విద్యుత్ వైర్ల కింద మొక్కలు నాటొద్దని ఆయన సూచించారు.
- **ఆమనగల్లు:** పోలెపల్లి, చెన్నంపల్లి అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ఎంపీటీసీల సంఘం మండల అధ్యక్షుడు కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పిల్లల తల్లులు, అంగన్‌వాడీ టీచర్లతో కార్యక్రమాన్ని నిర్వహించారు. చిన్నారులతో అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు ఇందిర, దేవేందర్, అంగన్‌వాడీ టీచర్లు అలివేలమ్మ, రాములమ్మ తదితరులు పాల్గొన్నారు.
- **కేశంపేట:**నీట్ పరీక్ష ప్రశ్నపత్రం పేపర్ లీకేజీ బాధ్యులపై కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని మండల యూత్ కాంగ్రెస్ నాయకుడు ఆమెర్ డిమాండ్ చేశారు. వేలాది మంది విద్యార్థుల జీవితాలలో ముడిపడి ఉన్న నీట్ లీకేజీపై చర్యలు తీసుకొని పరీక్షను మరోసారి నిర్వహించాలని డిమాండ్ చేశారు. విచారణకు కమిటీలు వేసి చేతులు దులుపుకోవద్దని, త్వరగా నిందితులను గుర్తించి శిక్షించాలని కోరారు.
- **ఇబ్రహీంపట్నం:** ఇబ్రహీంపట్నం పరిధి దండుమైలారం 11కేవీ ఫీడర్ కింద చెట్టు కొమ్మలు తొలగించే కార్యక్రమం చేపడుతున్నామని విద్యుత్ శాఖ ఏఈ శ్రీనివాస్‌రావు తెలిపారు. ఆదివారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు చెప్పారు.

## న్యాయవాది మృతి.. లాయర్ల నివాళి


నివాళులర్పిస్తున్న న్యాయవాదులు

షాద్‌నగర్ అర్బన్, జూన్ 22: షాద్‌నగర్‌కు చెందిన న్యాయవాది గోలెపు చంద్రశేఖర్ అనారోగ్యంతో శనివారం మృతిచెందారు. గత కొన్నాళ్లుగా అనారోగ్య సమస్యతో బాధపడుతున్న ఆయన హైదరాబాద్‌లోని ఓ ఆసుపత్రిలో చికిత్సపొందుతూ మృతి చెందా రు. ఆయనకు భార్య కుమారుడు, కుమార్తె ఉన్నారు. తోటి న్యాయవాదులు షాద్‌నగర్ కోర్టు సముదాయంలో చంద్రశేఖర్ ఫొటోకు నివాళులర్పించారు. అనంతరం సాయిబాలాజీ టౌన్‌షిప్‌లోని ఇంటికి వెళ్లి, కుటుంబ సభ్యులను పరామర్శించారు.

## రైతు సంక్షేమానికి కాంగ్రెస్ కట్టుబడి ఉంది


నర్సింహరెడ్డి

రంగారెడ్డి అర్బన్, జూన్ 22 : రైతు రుణమాఫీపై మంత్రి మండలి నిర్ణయం పట్ల డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి శనివారం హర్షం వ్యక్తం చేశారు. రైతుకు 2లక్షలు రుణమాఫీ చేస్తే అప్పుల్లో కూరుకున్న రైతులకు మేలు జరుగుతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమానికి కట్టుబడి ఉందని, ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రైతు రుణమాఫీ చేస్తుందని ఆయన చెప్పారు.

## 'రుణమాఫీతో జిల్లాలో 46వేల మంది రైతులకు లబ్ధి'

హైదరాబాద్ సిటీ, జూన్ 22(ఆంధ్రజ్యోతి): రైతులకు ఏకకాలంలో రూ.2లక్షల రుణమాఫీ చేస్తూ సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయం తీసుకోవడం హర్షనీయమని టెస్కాబ్ వైస్ చైర్మన్, రంగారెడ్డి డీసీసీబీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య అన్నారు. రుణమాఫీతో ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో సొసైటీ బ్యాంకుల ద్వారా రుణాలు పొందిన 46వేల మంది రైతులకు లబ్ధి చేకూరుతుందని శనివారం ఓ ప్రకటనలో వెల్లడించారు. ప్రభుత్వం రైతుల సమస్యలను పరిష్కారానికి ప్రాధాన్యం ఇస్తుందని, ఆర్థిక భారం పడుతున్నా ఒకేసారి రూ.31 వేల కోట్లు చెల్లించేందుకు పూనుకోవడం గొప్ప నిర్ణయమన్నారు. రుణమాఫీ నిర్ణయంపై రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోందన్నారు.

## పాఠశాలల సమస్యలపై ప్రత్యేక దృష్టి

కొత్తూర్, జూన్ 22: పాఠశాలలో నెలకొన్న సమస్యలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నాని స్థానిక ఎంపీపీ పి. మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని మక్తగూడ ప్రాథమిక పాఠశాలలో 6లక్షల80వేల రూపాలయల మండల పరిషత్ నిధులతో నిర్మించతలపెట్టిన ప్రహరీగోడ నిర్మాణం పనులను శనివారం ఎంపీపీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గడిచిన నాలుగు సంవత్సరాల్లో మండలంలో లక్షలాది రుపాయల మండల పరిషత్ నిధులతో అనేక కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు. సీసీ రోడ్లు, మురుగునీటి కాలువల నిర్మాణాలు, పాఠశాలలో మౌళిక సదుపాయాలు చేపట్టడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఎంపీవో శ్రీనివాస్, నాయకులు కాట్న రాజు, రాందాస్‌నాయక్, రవినాయక్, శ్రీరాములు, మల్లేష్, రాజు, రాములు, బాలయ్య, మోది దర్శన్, పాండు, శ్రీను, ఏలుగని శ్రీను, శ్రీశైలం, ఆంజనేయులు, శేఖర్, రమేష్, దయానంద్‌రెడ్డి, జయేందర్‌రెడ్డి, పాపిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## 'అంగన్‌వాడీ కేంద్రాలు గ్రామాలకు పట్టుకొమ్మలు'

షాబాద్, జూన్ 22: అంగన్‌వాడీ కేంద్రాలు గ్రామాలకు పట్టుకొమ్మలు అని అంగన్‌వాడీ టీచర్ వినోద అన్నారు. శనివారం వెంకమ్మగూడ అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు అక్షరాభ్యాసం నిర్వహించారు. అంగన్‌వాడీల్లో చిన్నారులకు విద్యతో పాటు, పౌష్టికాహారం అందజేస్తున్నట్లు తెలిపారు.